క్లుప్తంగా

జీవామృతం తయారీపై శిక్షణ



సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతిపథంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే ఘన, ద్రవ జీవామృతం తయారీపై ఏపీసీఎన్ఎఫ్ క్లస్టర్ కోఆర్డినేటర్ కె.భూషణరావు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆహార ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని, ఆ పంటలను మార్కెటింగ్ చేసేందుకు కూడా సీఎన్ఎఫ్ ద్వారా తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. రైతులు పంటల సాగులో రసాయన ఎరువులకు బదులు ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే వాటితో తయారు చేసిన ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు, కె.పద్మజ, కె.దీప ఉన్నారు.

చీరల పంపిణీ



ఎమ్మెల్యే ఇచ్చిన చీరలను ఉపాధ్యాయినులకు అందజేస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు గిరిజన నృత్యాలను ప్రదర్శించనున్నారు. నృత్య ప్రదర్శనకు అవసరమైన వివిధ రకాల చీరలను ఎమ్మెల్యే కళావతి విద్యార్థినులకు సమకూర్చారు. వాటిని ఐటీడీఏ ఉపవిద్యాశాఖ అధికారి ఎ.లిల్లీరాణి సోమవారం ఉపాధ్యాయులకు అందజేశారు. వాటిని 11 గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, మినీగురుకులాలకు చెందిన సుమారు 115 మంది విద్యార్థినులకు అందజేయనున్నారు.

ధ్రువపత్రాల అందజేత

భామిని: మండలంలోని ఘనసరలో గ్రామీణ వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణను పూర్తిచేసిన విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. మూడు నెలలుగా 57 మంది విద్యార్థులు డిజిటల్ ఎడ్యుకేషన్‌లో ఇక్కడ శిక్షణ పొందారు. వారందరికీ సర్టిఫికెట్లు అందజేసినట్లు నిర్వాహకుడు ఎరుకుమజ్జి అప్పలనాయుడు తెలిపారు. గ్రామీణ వికాస్ కేంద్రం ఆధ్వర్యంలో పది గ్రామాల్లో విద్యార్థులకు ట్యూషన్ సెంటర్లు, బాలల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.ప్రసాదరావు, కె.నీలకంఠం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ లక్ష్యాలను సక్రమంగా అమలుచేయాలని, సేవలు నిష్పాక్షికంగా అందించాలని విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని యాలాం కూడలిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్, హాజరుపట్టి తనిఖీ చేశారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. కేంద్రాల నిర్వహణపై సూపర్‌వైజర్ మేరీకి పలు సూచనలు చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు



సోమాల రత్నం రాజు(ఫైల్)

భామిని: బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడి మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్సై యతిరాజుల అమ్మనరావు సోమవారం తెలిపారు. మండలంలో రోడ్డు పనులు చేసేందుకు సామర్లకోట నుంచి వలస వచ్చిన సోమాల రత్నంరాజు(25) కనిపించడం లేదంటూ ఫిర్యాదు అందినట్లు పేర్కొన్నారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 6309990884 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

అంగన్‌వాడీల వినతి

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సంపూర్ణ పౌష్టికాహార పంపిణీలో భాగంగా ఎఫ్ఆర్ఎస్ యాప్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సీడీపీఓ సిమ్మాలమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. యాప్ వినియోగంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వీరఘట్టం: మైనర్లుగా ఉన్న మీ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్సై ఎం.వి.రమణ సూచించారు. స్థానిక గ్రోమోర్ సెంటర్ వద్ద సోమవారం వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపేటప్పుడు జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే అందుకు తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

పైరుకు శక్తి.. రైతుకు లాభం

- ఎరువులు పొదుపుగా వాడితే మేలు
- మోతాదుకు మించితే దిగుబడిపై ప్రభావం
- ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన



వరినాట్లు వేసిన పొలం

వీరఘట్టం: ఈ ఏడాది సకాలంలో తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడిచిపెట్టడంతో పాటు అడపాదడపా వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. వరినాట్లు పూర్తిచేసిన రైతులు పైరు ఎదుగుదలకు ఎరువులు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అయితే ఈ సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంట దిగుబడి బాగుంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. విచక్షణ రహితంగా ఎరువులు వేయడం వల్ల సాగుఖర్చు పెరగడంతో పాటు భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుందని అంటున్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలని, నత్రజని, పొటాషియం, భాస్వరం, జింకు వంటి కాంప్లెక్స్ ఎరువుల వినియోగంలో సమతుల్యత పాటించాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చునని అంటున్నారు. పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 58,503 ఎకరాల్లో వరిసాగు లక్ష్యం కాగా, ఇంతవరకు 35 వేల ఎకరాల్లో ఉభాలు పూర్తయ్యాయి. మరో రెండు వారాల్లో శతశాతం వరినాట్లు పూర్తికానున్నాయి.

నియోజకవర్గంలో వరిసాగు విస్తీర్ణం

మండలం	సాగు(ఎకరాల్లో)
పాలకొండ	17,033
వీరఘట్టం	18,964
సీతంపేట	8,953
భామిని	13,553
మొత్తం	58,503

ఎరువుల వినియోగం ఇలా..

ఖరీఫ్ మొదట్లో చేపట్టే దమ్ములో ఎకరా పొలంలో యూరియా 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు, పొటాష్ 10 కిలోలు చొప్పున వేసుకోవాలి. ఉభాలు పూర్తయిన తరువాత మొక్క పిలక దశలో 20 కిలోల యూరియా, అంకురం దశలో 25 కిలోల చొప్పున యూరియా, పొటాష్‌లను వినియోగిస్తే పంట దిగుబడి బాగుంటుంది.

- నత్రజని కాంప్లెక్స్ రూపంలో, యూరియా రూపంలో వాడాలి. ఈ ఎరువు పంట ఎదుగుదలకు, పచ్చగా ఉండేందుకు దోహదపడుతుంది. దీన్ని మూడు భాగాల్లో వినియోగించాలి. మొదటగా దమ్ములో, రెండోసారి పిలక దశలో, మూడోసారి అంకురం దశలో వేసుకోవాలి.
- మొక్కల వేర్లు బలంగా ఉండేందుకు దమ్ము సమయంలో భాస్వరం వాడతారు. లేని పక్షంలో నాట్లు వేసిన వారం రోజుల్లోపు దీన్ని వేసుకోవాలి. దమ్ములో మూడు బస్తాల సింగిల్ సూపర్‌ఫాస్పేట్ రూపంలో 50 కిలోల డీఏపీని వేసుకుంటే పంట బాగుంటుంది.
- పొటాష్ వల్ల ఆకుల గరుకుతనం కలిగి ఉండడమే కాకుండా గింజ గట్టిపడేందుకు దోహదపడుతుంది. వరికి చీడపీడల బెడద తగ్గుతుంది. పొటాష్‌ను దమ్ము అంకుర దశలో వేసుకోవాలి.
- జింకును దమ్ములో ఎకరాకు 20 కిలోలు చొప్పున వేసుకోవాలి. జింకు లోపాన్ని పంటచేలో గుర్తిస్తే వంద లీటర్ల నీటిలో 10 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.

అధికం అనర్థం



పంట దిగుబడి కోసం అధిక మోతాదులో ఎరువులు వినియోగించడం లాభం కంటే నష్టమే అధికం. విచక్షణా రహింతగా ఎరువులు, పురుగు మందులు వాడితే భూసారం దెబ్బతింటుంది. వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

– జుక్కువ సౌజన్య, వ్యవసాయశాఖ అధికారి, వీరఘట్టం

నులిపురుగుల నివారణపై అవగాహన



నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరుపతిరావు

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై డాక్టర్ తిరుపతిరావు సోమవారం అవగాహన కల్పించారు. నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీటి నివారణకు ఆగస్టు 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–19 సంవత్సరాల మధ్య పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ నీచ రాజకీయాలు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: ప్రజల నుంచి ఆదరణ కరువవడంతో టీడీపీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. పాలకొండలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పుంగనూరులో హింసను ప్రేరేపించడం ద్వారా చంద్రబాబు తన నైజాన్ని బయటపెట్టారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో గెలుస్తామన్న నమ్మకం లేకే టీడీపీ నాయకులు రాష్ట్రంలో హింసా కాండలకు ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, లోకేష్ యాత్రల పేరుతో చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని, హింసను ప్రేరేపించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లి సానుభూతి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసులపై రాళ్లతో దాడి చేయించి వారిని గాయపరిచారని, అదే పోలీసులు కాల్పులు చేపడితే అందులో లబ్ధిపొందాలని చంద్రబాబు కుటిల ఆలోచన అని అన్నారు. దెబ్బలు తగిలినా కూడా పోలీసులు సహనంతో ఉండటంతో చంద్రబాబు కుట్ర ఫలించలేదన్నారు. కుప్పంలోనూ చంద్రబాబుకు ప్రజల నుంచి మద్దతు కరువు కావడంతో అసహనంతో ఇటువంటి రాజకీయలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి, కులాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చంద్రబాబు చూస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు సంయమనం పాటించాలని, మోసగాడు చంద్రబాబు నైజం గుర్తించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు ఉన్నారు.

జనరంజక పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం



లబ్ధిదారుకు సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: జనరంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కడగండి గ్రామ సచివాలయం పరిధి ఓంద్రుజోల, సంతవలస, బూచెంద్రి, కడగండివలస, పెద్దవంగర, పెద్దవంగరగూడ గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిగి గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు, వరదగోడ నిర్మాణం, తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మెరుగైన పాలన అందించేందుకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, సర్పంచ్ కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, కె.చంద్రరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉత్సవానికి తరలిరండి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ ఆవరణంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి గిరిజనులంతా హాజరు కావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించుకుందామన్నారు. అడవితల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలతో పాటు గిరిజన నృత్యాలు, గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించేలా స్టాల్స్ ఏర్పాటు వంటి ఉంటాయన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మెన్ హిమరక మోహనరావు, పుబ్బాడ, దోనుబాయి సర్పంచ్‌లు కేశవరావు, వెంకునాయుడు, పార్టీ నాయకులు ఎస్.రాము ఉన్నారు.

సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికకు నోటిఫికేషన్

కురుపాం: మండలంలోని గుమ్మ సర్పంచ్ ఎన్నికకు, బియ్యాలవలస వార్డు మెంబర్ (ఉప సర్పంచ్) ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎంపీడీఓ వి.వి.శివరామప్ప సోమవారం తెలిపారు. ఈ రెండు స్థానాలకు ఈ నెల 8న నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు.

ఆటో యూనియన్ ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు

పాలకొండ రూరల్: స్థానిక కోటదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యుడైన పడాల అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను సహచర యూనియన్ సభ్యులు సోమవారం కలిసి పరామర్శించారు. మృతుని భార్య ధనలక్ష్మికి యూనియన్ తరఫున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై సీఐటీయూ ఆందోళన

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీరుతో ప్రజల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతోందని సీఐటీయూ నాయకులు నినదించారు. ఈ మేరకు సోమవారం పాలకొండలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లలో మోదీ దేశాన్ని కార్పొరేటు సంస్థలకు అప్పగించారని, ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 9న కేంద్రం తీరును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళనలు, మహా ధర్నాలు, నిరసనల్లో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ర్యాలీలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కె.రాము, సంఘమేశ్వరరావు, సంజీవి, సురేష్, శ్రీదేవి, విమల, భాస్కరరావు తదితరులున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై ఎండీ హామీ



కోటదుర్గమ్మకు పూజలు చేస్తున్న ఈయూ రాష్ట్ర నాయకులు దామోదరరావు, తదితరులు

పాలకొండ రూరల్: ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగుల 11వ పీఆర్సీ అమలు అనంతరం సిబ్బంది పదోన్నతుల్లో ఎదురైన సమస్యల పరిష్కారానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు హామీ ఇచ్చారని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదరరావు అన్నారు. సోమవారం పాలకొండ వచ్చిన ఆయన ఇక్కడి ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆర్టీసీని ప్రభుత్వంలో వీలీనం చేయటం చారిత్రిక ఘట్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగులకు ఓటీలు, రాత్రి బస అలవెన్సులు, మహిళలకు హెల్త్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం యాజమాన్యంతో కలిసి చొరవ చూపాలని కోరారు. విలీనంకు ముందున్నట్లు ఆర్టీసీ రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్ ప్రాప్తికి ఉద్యోగుల సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలన్నారు. సమస్యలు జేఏసీ ద్వారా ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్తామన్నారు. ఆయన వెంట ఈయూ నాయకులు భాసూరు కృష్ణమూర్తి, వీవీ రమణ, ఎంవీఎస్ నారాయణ, వీఆర్ నాయుడు, జి.విజయ్‌కుమార్ తదితరులున్నారు. అంతకుముందు కోటదుర్గమ్మను ఈయూ నాయకులు దర్శించుకున్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి: ఏఓ

పాలకొండ రూరల్: ఆర్‌బీకేల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రైతులకు అదుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు అందించాలని ఏఓ ఎన్ని వాహిని అన్నారు. మండలంలోని లుంబూరు ఆర్‌బీకేని సోమవారం ఆమె సందర్శించి ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, వ్యవసాయరంగ పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఆర్‌బీకేలో ప్రదర్శించాలని సూచించారు. మండలంలో పలుచోట్ల వరినాట్లు జరుగుతున్నందున గ్రామీణ వ్యవసాయ సహాయకులు వారి సేవలు విస్తృతం చేయాలన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



రాయగడజమ్ములో సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం నాగార్జున

గుమ్మలక్ష్మీపురం: అంతరపంటలతో అధిక ఆదాయం పొందవచ్చని నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున అన్నారు. మండలంలోని గొరడ, రాయగడ జమ్ము గ్రామాల్లో జట్టు ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతోట ప్రాజెక్టుకు అనుసంధానంగా ఈ ఏడాది నుంచి జీవ పైలెట్ ప్రాజెక్ట్ పేరుతో సాగు చేస్తున్న పసుపు, అల్లం, పైనాపిల్, సారికంద, కందులు, కొర్రలు, సామలు, ఆకుకూరలు, కాయగూరలు, తీగ జాతులు, శ్రీరాగి వంటి అంతర పంటలను ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకులు పి.షణ్ముఖరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర పంటలను ఏడాది పొడవునా సాగు చేయడం వలన అధిక ఆదాయం సమకూరుతుందన్నారు. పంటల సాగుకు కావాల్సిన ప్రోత్సాహాన్ని రైతులకు అందిస్తామన్నారు. పంటల సాగులో రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ, జీవ ఎరువులను వినియోగించాలని సూచించారు. అనంతరం వివిధ రకాల పండ్ల మొక్కలను, భూసార పరీక్ష కార్డులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, మాతోట కమిటీ సభ్యులు ఎం.కమలకుమారి, కె.చిరంజీవి, జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఎస్.ప్రహరాజ్, జీవ కోఆర్డినేటర్ జి.ప్రభోద్, కోఆర్డినేటర్ మురళీమోహన్ ఉన్నారు.

గిరిజన స్పందనకు 108 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 108 వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని, ఆర్థిక సాయం అందించాలని, ఉపాధి కల్పించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు. ఎగువదరబ గ్రామానికి రహదారి నిర్మించాలని, బంబడుగూడలో మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. వినతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ, పీహెచ్ఓ గణేష్, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి తదితరులు పాల్గొన్నారు.


కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: కొత్త ఓటర్లను చేర్పించడంలో బూత్ లెవెల్ కమిటీలు చురుగ్గా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గ పరిశీలకులు గొండు కృష్ణమూర్తి సూచించారు. నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన తరువాత తొలిసారిగా సోమవారం పాలకొండ వచ్చిన ఆయన పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌తో పాటు నియోజకవర్గ నాయకులు కృష్ణమూర్తిని సన్మానించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలపై దీటుగా స్పందించాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్ల రక్షణకు ప్రత్యేక విభాగం



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సంస్థ సభ్యులు

కురుపాం: మండల కేంద్రంలో ఉన్న వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్ ప్రొటెక్షన్ సెల్ విధులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దవడ కొండబాబు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్‌ను ఎవరైనా హేళన చేసినా, ఇబ్బంది పెట్టినా టోల్‌ఫ్రీ నంబర్ 1091 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న లింగ నిర్ధారణ సర్టిఫికెట్లను ప్రతీ ట్రాన్స్‌జెండర్ తీసుకోవాలని సూచించారు. అనంతరం గోడపత్రికను విడుదల చేశారు. అలాగే హిజ్రాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గీతారాణి, అసోసియేషన్ సభ్యులు నందిని, చిన్ని, శృతి, మీతోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సిస్టర్ అమిత, కురుపాం నియోజకవర్గంలో ఉన్న హిజ్రాలు పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనిద్దాం..



సీతంపేట: చేనేత వస్త్రధారణలో ఉపాధ్యాయినులు



పాలకొండ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం



గుమ్మలక్ష్మీపురం: చేనేత వస్త్రాలు ధరించి ఫ్యాషన్‌షో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

- ఘనంగా చేనేత దినోత్సవం

పాలకొండ రూరల్: చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా నేత కార్మికులకు చేయూతనిద్దామని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు అన్నారు. కళాశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత దుస్తుల విశిష్టతను ఆప్కో సిబ్బంది విద్యార్థులకు వివరించారు. అలాగే స్థానిక వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం పరాంకుశం నాయుడు నేతృత్వంలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు.

- గుమ్మలక్ష్మీపురం: చేనేత కార్మికులను ప్రోత్సాహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగించాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఫ్యాషన్ షో నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్ఎం జి.హరిప్రసాద్ నేత కార్మికుల కష్టాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.
- సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చేనత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు చేనేత చీరలతో ఫ్యాషన్ షో నిర్వహించారు. చేతితో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను విద్యార్థినులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.లిల్లీరాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.